క్లుప్తంగా

కొండూరు అనిల్‌బాబుకు పరామర్శ



గోవిందయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ

నెల్లూరు(బారకాసు) : ఆప్కాబ్ మాజీ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు తండ్రి గోవిందయ్య ఇటీవల మరణించారు. ఈ నేపథ్యంలో అల్లూరు మండలం, ఇస్కపల్లి పంచాయతీ, సంభునివారిపల్లెలోని ఆయన నివాసానికి ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ సిటీ ఇన్‌చార్జి పర్వత రెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం వెళ్లి అనిల్‌బాబును పరామర్శించారు. అనంతరం గోవిందయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన వెంట కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున పాల్గొన్నారు.

డయేరియాపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(బారకాసు) : కలుషిత తాగునీటితో ప్రబలే డయేరియా పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని కమిషనర్ సూర్యతేజ తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులు, సచివాలయ కార్యదర్శులతో 'డయేరియా నివారణ– తాగునీటి నాణ్యత' అనే అంశంపై సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డయేరియా, మలేరియా, టైఫాయిడ్, చికెన్‌గన్యా, డెంగీ వంటి వ్యాధులను అరికట్టడానికి ఎప్పటికప్పుడు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా అవగాహన కల్పించాలని సూచించారు. మంచినీటి సరఫరాలో లీకేజీ ప్రాంతాలు, బహిరంగ ప్రదేశాల్లో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకుల నుంచి సరఫరా అవుతున్న తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, క్రమం తప్పకుండా సచివాలయ కార్యదర్శులు తాగునీటి పరీక్షలు నిర్వహించి, నివేదికలను ఉన్నతాధికారులకు అందించాలని చెప్పారు. సమావేశంలో అదనపు కమిషనర్ నందన్, ఎస్ఈ రామ్మోహన్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చైతన్య, అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ అధికారి డాక్టర్ జిజియాబాయి, ఇంజినీరింగ్, శానిటేషన్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

హోరాహోరీగా హాకీ పోటీలు



హాకీ ఆడుతున్న క్రీడాకారులు

నెల్లూరు సిటీ : 68వ రాష్ట్రస్థాయి బాలబాలికల హాకీ చాంపియన్ షిప్ పోటీలు రూరల్ మండలంలోని సౌత్‌మోపూరులో రెండోరోజు(సోమవారం) హోరాహోరీగా జరిగింది. బాలికల విభాగంలో 10 మ్యాచ్‌లు, బాలుర విభాగంలో 11 మ్యాచ్‌లు నిర్వహించారు. ఈ క్రమంలో ఆయా మ్యాచ్‌లలో గెలుపొందిన జట్లకు మంగళవారం సెమీఫైనల్స్ జరుగుతుంది. బాలికల విభాగంలో సెమీఫైనల్స్‌కు పశ్చిమగోదావరి, కడప, అనంతపురం, విశాఖపట్నం జట్లు చేరుకున్నాయి. బాలుర విభాగంలో నెల్లూరు, కడప, చిత్తూరు, పశ్చిమ గోదావరి జట్లు సెమీఫైనల్స్‌కు ఎంపికయ్యాయి.

జాతీయ హాకీ పోటీలకు నెల్లూరు క్రీడాకారుడు



అరవ అఖిల్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైలో 14వ జాతీయ స్థాయి సీనియర్ హాకీ చాంపియన్‌షిప్ పోటీల్లో నెల్లూరుకు చెందిన క్రీడాకారుడు అరవ అఖిల్ రాష్ట్ర జట్టు తరఫున పాల్గొంటున్నారు. గత నెలలో కాకినాడలో నిర్వహించిన సీనియర్ నేషనల్ క్యాంప్‌లో పాల్గొని శిక్షణ పొందిన నెల్లూరు హాకీ క్రీడాకారుడు అఖిల్ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడం పట్ల పలువురు సోమవారం హర్షం వ్యక్తం చేశారు.

చీకటి కార్యకలాపాలపై దాడులు

నెల్లూరు(క్రైమ్): నగరంలోని విజయమహాల్ గేటు పరిసర ప్రాంతాల్లో రాత్రి వేళల్లో చీకటి కార్యకలాపాలు జోరుగా సాగుతున్నాయి. కొందరు హిజ్రాలు, సెక్స్‌వర్కర్ల ఆగడాలు శ్రుతిమించుతున్నాయి. దీంతో అటుగావైపుగా రాకపోకలు సాగించాలంటేనే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో చీకటి కార్యకలాపాలను కట్టడి చేసేందుకు చిన్నబజార్, సంతపేట, బాలాజీనగర్ పోలీసులు సంయుక్త ప్రణాళికలు రూపొందించారు. విజయమహాల్ గేటు పరిసర ప్రాంతాల్లో తనిఖీలు విస్తృతం చేశారు. సోమవారం రాత్రి బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ కె.సాంబశివరావు తన సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. ముగ్గురు సెక్స్ వర్కర్లను అదుపులోకి తీసుకున్నారు. ఇకపై రోజూ తనిఖీలు నిర్వహిస్తామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

అన్నదాతపై బీమా పిడుగు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలను నిలువునా ముంచుతోంది. ఏదో ఒక విధంగా ప్రజల నుంచి నగదును వసూలు చేస్తోంది. ఇప్పటికే విద్యుత్ చార్జీల పెంపునకు కుట్రలు చేస్తున్న సర్కార్ తాజాగా రైతుల నుంచి బీమా ప్రీమియం చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది.

- గత ప్రభుత్వంలో రైతుల తరఫున ప్రభుత్వమే చెల్లింపు
- ప్రస్తుతం రైతుల నుంచి ముక్కుపిండి వసూలు
- జిల్లాలో దాదాపుగా రూ.6.53 కోట్ల భారం



ఇటీవలి వర్షానికి దెబ్బతిన్న పంట (ఫైల్)

నెల్లూరు(సెంట్రల్) : రైతులను ఎల్లప్పుడూ ఆదుకుంటామని ప్రగల్భాలు పలికే కూటమి ప్రభుత్వం వారిపై కక్ష సాధింపులకు పాల్పడుతోంది. సరైన వర్షాలు లేక జిల్లాలో గడిచిన ఖరీఫ్ సీజన్‌లో దాదాపుగా అన్నింటినీ కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతం ఎగువ ప్రాంతంలో కొంతమేర వర్షపాతం ఉండడంతో సోమశిల రిజర్వాయర్‌లో నీరు ఉంది. ఇప్పటికే వ్యవసాయం లేక నిండా మునిగిన రైతులపై సర్కారు మాత్రం ముక్కుపిండి వసూలు చేసేలా బీమా ప్రీమియం చెల్లించాలని చెప్పడంతో ఇది మంచి ప్రభుత్వమా.. లేక ముంచే ప్రభుత్వమా అంటూ పలువురు విమర్శలు చేస్తున్నారు.

ప్రీమియం కట్టాల్సిందే

రైతులు వేసిన పంటల విషయంలో అనుకోని కారణాల చేత పంట దిగుబడి తగ్గి రైతులకు నష్టం వస్తే దాన్ని అంచనా వేసి రైతులకు బీమా రూపంలో ప్రభుత్వం నగదు చెల్లిస్తుంది. ఇందుకోసం రైతుల వద్ద నుంచి ప్రీమియం అంటూ హెక్టార్‌కు ఒక రేటును ఫిక్స్ చేసి నగదు వసూలు చేస్తున్నారు.

రైతులపై భారం

రైతుల పంటల బీమా విషయంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం హెక్టారుకు ఒక రేటు ఫిక్స్ చేసి వసూలు చేస్తోంది. ఈ విధంగా బీమాకు నగదు చెల్లించిన వారికి మాత్రమే పంట దిగుబడిలో నష్టం వస్తే ప్రభుత్వం ఆదుకుంటుందని, లేకుంటే పైసా కూడా ఇవ్వదని తెగేసి చెప్పింది. ఈ విధంగా చూసుకుంటే జిల్లాలో దాదాపుగా అన్ని పంటలు కలిపి 4.50 లక్షల ఎకరాల్లో సాగు వేసుకున్నా దాదాపుగా రూ.6.53 కోట్లకు పైగా రైతుల నుంచి ప్రభుత్వం బీమా రూపంలో వసూలు చేస్తోంది. సాగు పెరిగే కొద్దీ ఈ నగదు కూడా పెరుగుతూ వస్తుంది. కాగా కొందరు బ్యాంకుల్లో వ్యవసాయ రుణాలు తీసుకుంటే దానిలో బీమా నగదును ముందుగానే కట్టించుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ విధంగా బీమాపై కూడా రైతుల నుంచి వసూలు చేస్తుండడంతో పెద్ద ఎత్తున విమర్శలు వినిపిస్తున్నాయి.

గత ప్రభుత్వంలో ఉచిత బీమా

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతుల తరఫున బీమా నగదును చెల్లించేది. మొదట్లో రైతులు హెక్టారుకు రూ.1 చెల్లిస్తే చాలని, మొత్తం బీమా రైతులకు వర్తించే విధంగా చేసింది. తరువాత కూడా ఆ ఒక్క రూపాయి కూడా రైతుల నుంచి ఎందుకు కట్టించుకోవాలని దానిని కూడా ప్రభుత్వమే చెల్లించడం గమనార్హం. ఈ క్రాప్‌లో నమోదు చేసుకున్న ప్రతి రైతుకు గత ప్రభుత్వంలో ఉచితంగా బీమా సౌకర్యం కల్పించి పంటలో దిగుబడి తగ్గిన ప్రతి రైతుకు నష్టం పరిహారం చెల్లిస్తూ వచ్చింది. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతుల నుంచి నగదు వసూలు చేస్తుండడంతో గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి ఎంత తేడా అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు.

పంట రకం	హెక్టార్‌కు చెల్లించాల్సిన మొత్తం
వరి	రూ.420
మినుము	రూ.95
శనగలు	రూ.140
పెసలు	రూ.90
వేరుశనగ	రూ.150

ప్రీమియం చెల్లించాల్సి ఉంది



ప్రభుత్వ నిబంధనల ప్రకారం బీమా ప్రీమియంను రైతులు చెల్లించాల్సి ఉంది. ఐదెకరాల పంటలకు సంబంధించి ఈ నగదు చెల్లింపు ఉంటుంది. పంటను బట్టి హెక్టారుకు ఒక రేటు ప్రకారం నగదు ఉంటుంది. బీమా నగదు చెల్లించిన రైతులకు పంట దిగుబడిలో ఏదైనా నష్టం వస్తే బీమా నగదు వస్తుంది.

– సత్యవాణి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

పోస్టర్ల ఆవిష్కరణ



నెల్లూరు(దర్గామిట్ట) : జిల్లా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం అందిస్తున్న వివిధ రకాల సేవలకు సంబంధించిన ఉచిత అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్ల వాల్‌పోస్టర్లను కలెక్టర్ ఆనంద్ సోమవారం ఆవిష్కరించారు. కలెక్టరేట్ వీటిని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. వీటిని ప్రతి అంగన్‌వాడీ సెంటర్‌లో విధిగా ప్రదర్శించాలన్నారు. డీఆర్వో ఉదయ్‌భాస్కర్, జెడ్పీ ఇన్‌చార్జి సీఈఓ మోహన్‌రావు, డీపీఓ శ్రీధర్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి, డ్వామా పీడీ గంగాభవాని, డీటీసీ చందర్, ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, డీసీపీఓ సురేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని 33/11 కేవీ వైఎంసీఏ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేపడుతున్న కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని విద్యుత్‌శాఖ టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆచారివీధి, ట్రంక్ రోడ్డు, యడ్లవారివీధి పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సంఘ బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం

నెల్లూరు(బృందావనం) : పెన్షనర్ల సంఘం బలోపేతానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. స్థానిక బీవీనగర్‌లోని పీఎస్ రామానుజాచార్యులు ప్రభుత్వ పెన్షనర్ల సంక్షేమ భవనంలో 'స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్' జిల్లా సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం పటిష్టమైతే తద్వారా సమస్యల పరిష్కారం సులభం అవుతుందన్నారు. ఏ సంఘమైనా న్యాయస్థానాల్లో ఉన్న వివాదాల్లో జోక్యం చేసుకోదని, డిమాండ్ల సాధనకు సంయమనం పాటించాలని సూచించారు. జిల్లా శాఖ అధ్యక్షుడు ఎస్ఎం.గౌస్ మాట్లాడుతూ పెన్షనర్లకు రావాల్సిన పెండింగ్ బకాయిలను మంజూరు చేయాలని కోరారు. సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రమణయ్య, ఆత్మకూరు ప్రధాన కార్యదర్శి సుధాకర్, ఉపాధ్యాయ ఉద్యమ నేత బాబురెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్వీపీఎస్ మూర్తి, కోశాధికారి జె.హజరత్తయ్య, బుచ్చి ప్రధాన కార్యదర్శి మాల్యాద్రి, ఉపాధ్యక్షులు వీరేంద్రనాథ్, గోపాల్, ఖాసీం, అసోసియేట్ అధ్యక్షుడు ఎస్.శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు. కాగా డాక్టర్ అగర్వాల్ కంటి ఆస్పత్రి వైద్యురాలు మమత ఆధ్వర్యంలో పెన్షనర్లకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు.

కార్తీక దీపోత్సవాన్ని జయప్రదం చేద్దాం



మాట్లాడుతున్న డాక్టర్ వెన్నెల

నెల్లూరు(బృందావనం) : ఇరుకళల పరమేశ్వరి ఆలయ సమీపంలో ఉన్న స్వర్ణలింగేశ్వరస్వామి దేవస్థానం వద్ద ఈనెల 15వ తేదీ జరుగనున్న మహాకార్తీక దీపోత్సవాన్ని జయప్రదం చేయాలని సింహపురి కార్తీక దీపోత్సవ సమితి అధ్యక్షురాలు డాక్టర్ కె.వెన్నెల తెలిపారు. స్థానిక స్వర్ణలింగేశ్వర స్వామి ఆలయం వద్ద సింహపురి కార్తీక దీపోత్సవ సమితి ఆధ్వర్యంలో విస్తృత స్థాయి సమావేశం సోమవారం జరిగింది. తొలుత ఆలయ ప్రాంగణంలోని ఉసిరి చెట్టు వద్ద కార్తీక దీపారాధన చేశారు. అనంతరం డాక్టర్ వెన్నెల మాట్లాడుతూ నగర పరిధిలో లక్షమందికి పైగా మహిళలు కార్తీక దీపోత్సవంలో పాల్గొనేలా విస్తృత ఏర్పాట్లు చేస్తామన్నారు. సమితి ప్రధాన కార్యదర్శి బయ్యా రంగమల్లిక మాట్లాడుతూ ఉదయం 6 నుంచి 11 గంటల వరకు గోపూజ, తాత్కాలిక రామలింగేశ్వర లింగ ప్రతిష్ట, భక్తుల స్వహస్తాలతో అభిషేకం, తదితర పూజలు జరుగుతాయన్నారు. సాయంత్రం 4 నుంచి 9 గంటల వరకు దీపోత్సవ ర్యాలీ, జ్వాలాదీపం–ఆకాశ దీపం, గంగాహారతి ఉంటుందన్నారు. సమన్వయకర్త పి.సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంలో కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. మహిళలకు దీపారాధన సామగ్రిని అందజేయనున్నామన్నారు. సమావేశంలో కోడూరు జయప్రద, నాగలక్ష్మి, ఉమాదేవి, గురవమ్మ, జయలక్ష్మి, సి.సురేఖ, డి.ప్రవీణ, ఒ.సత్యనారాయణ, ముక్కాల వ్యాసప్రసాద్, నరేంద్ర, అప్పల శ్రీధర్, రంగరాజన్, భాస్కర్, జి.విజయకుమార్, భక్తమండళ్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు లాభదాయకం



మాట్లాడుతున్న సత్యవాణి

నెల్లూరు(సెంట్రల్) : రైతులు పంటలు వేసే ముందు భూసార పరీక్షలు చేసుకుంటే ఎంతో లాభదాయకం అని జిల్లా వ్యవసాయశాఖ అధికారి సత్యవాణి పేర్కొన్నారు. నెల్లూరులోని కృషి విజ్ఞాన కేంద్రంలో కేవీకే ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ లలితా శివజ్యోతి ఆధ్వర్యంలో సమగ్ర పోషక యాజమాన్యం అనే అంశంపై 15 రోజుల పాటు శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూసార పరీక్షల వల్ల ఎంత మేర ఎరువులను వినియోగించాలో తెలుసుకోవచ్చన్నారు. ప్రధానంగా సేంద్రియ ఎరువుల వల్ల ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. అనంతరం లలితా శివజ్యోతి మాట్లాడుతూ నేల సారవంతం తగ్గకుండా చూసుకుంటే పంట బాగుంటుందన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

రంగడి సన్నిధిలో నేడు పూజలు

నెల్లూరు(బృందావనం) : రంగనాయకులపేటలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో మంగళవారం విశేష కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు సోమవారం తెలిపారు. భక్తులు విశేషంగా తరలిరావాలని కోరారు.

కార్పొరేటర్లతో సమావేశం



నెల్లూరు(బారకాసు) : వైఎస్సార్‌సీపీ సిటీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి నగరంలోని రాంజీనగర్‌లో ఉన్న తన కార్యాలయంలో సోమవారం కార్పొరేటర్లతో సమావేశమయ్యారు. మంగళవారం జరుగనున్న కౌన్సిల్ సమావేశంపై చర్చించారు. కార్పొరేటర్లు వేలూరు మహేష్, ఊటుకూరు నాగార్జున, కామాక్షిదేవి, కరీముల్లా, జయలక్ష్మి, నీలి రాఘవరావు, నేతాజీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ జెండాల ఆవిష్కరణ



నెల్లూరు(అర్బన్) : స్థానిక 25వ డివిజన్‌లో డీవైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పలుప్రాంతాల్లో జెండాలను ఆ సంఘ నాయకులు సోమవారం ఆవిష్కరించారు. బుజబుజనెల్లూరు భగత్‌సింగ్ కాలనీలో డీవైఎఫ్ఐ జెండాను నాయకులు తాటిపర్తి శ్రీనివాసులు, శివాజీ కాలనీలో ఉయ్యాల శ్రీనివాసులు, మిట్టమీద సెంటర్‌లో విజయ్‌కుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘ జిల్లా మాజీ నాయకుడు కొండా ప్రసాద్, శాఖా కార్యదర్శి కృష్ణమూర్తి, శంకర్, వికాస్, రాగి శ్రీనివాసులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలి

- కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(బారకాసు) : నగరపాలక సంస్థ పరిధిలోని ఇంటి, కుళాయి, డ్రెయినేజీ, వాణిజ్య సముదాయ భవనాలకు సంబంధించిన పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఆయన సోమ వారం నిర్వహించారు. పలువురు తమ సమస్యలపై కమిషనర్‌కు అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ పన్నుల వసూళ్ల విషయంలో ఎవ రూ నిర్లక్ష్యం వహించరాదన్నారు. నిర్దేశించిన లక్ష్యాల ను సకాలంలో పూర్తి చేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు కొంత మంది అధికారులు మాత్రమే వస్తున్నారని, మిగిలిన వారు కూడా తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు. స్థానిక సమస్యలపై కమాండ్ కంట్రోల్ విభాగంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేస్తే తక్షణమే స్పందించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రస్తుతం వచ్చిన వినతులు పునరావృతం కాకుండా చూడాలన్నారు.

మొత్తం వినతులు 42

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మొత్తం 42 అర్జీలు స్వీకరించామని కమిషనర్ తెలియజేశారు. ఇందులో రెవెన్యూ 1, ఇంజినీరింగ్ 13, అకౌంట్స్ 6, ఆప్కాస్ 1, టౌన్ ప్లానింగ్ 9, పబ్లిక్ హెల్త్ 6, హౌసింగ్ విభాగానికి 6 చొప్పున వినతులు వచ్చాయన్నారు. అదనపు కమిషనర్ నందన్, ఎస్ఈ రామ్మోహన్‌రావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చైతన్య, సిటీ ప్లానర్ కృష్ణకిశోర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించారు



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ నేత మల్లికార్జున

వేదాయపాళెంలోని కేశవులనగర్, స్పిన్నింగ్ మిల్ కాలనీ, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ముందున్న ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురవుతోందని 28వ డివిజన్ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మల్లికార్జున అన్నారు. ఈ మేరకు ఆయన ఎన్ఎంసీ కార్యాలయంలో కమిషనర్ సూర్యతేజను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ స్థలంలో ఉన్న బోర్డును అధికార పార్టీకి చెందిన కొందరు వ్యక్తులు తొలగించి అందులో చిన్న దుకాణాన్ని ఏర్పాటు చేసుకుంటున్నారని తెలిపారు. ఎన్ఎంసీ అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురికాకుండా కాపాడాలని కోరారు.

సర్వసభ్య సమావేశం నేడు

నెల్లూరు(బారకాసు) : నగర కార్పొరేషన్ కార్యాలయంలో ఉన్న సమావేశ మందిరంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు సర్వసభ్య సమావేశం జరుగుతుందని కమిషనర్ సూర్యతేజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మేయర్ స్రవంతి అధ్యక్షతన జరిగే సమావేశంలో కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు పాల్గొనాలని కోరారు.

15న కార్తీక దీపోత్సవం

నెల్లూరు(సెంట్రల్) : నగరంలోని ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం సమీపంలో ఉన్న గణేశ్‌ఘాట్ వద్ద ఈనెల 15న కార్తీక దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ఆయన కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు.

వృద్ధురాలి అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): కూరగాయల కోసం వెళ్లిన వృద్ధురాలు అదృశ్యమైంది. పోలీసుల కథనం మేరకు.. పాత మున్సిపల్ ఆఫీసు ఎదురు వీధిలో ఎం.రమణి కుటుంబం నివాసం ఉంటోంది. ఆమె సోమవారం కూరగాయల కోసం ఇంటి నుంచి బయటకు వచ్చి అదృశ్యమైంది. బాధిత కుటుంబసభ్యులు గాలించారు. జాడ తెలియకపోవడంతో సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రిజిస్ట్రేషన్ పట్టాలివ్వాలి



సామూహిక ధర్నా చేస్తున్న సీపీఎం నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని పలు ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ పట్టాలు లేక 70 శాతం మంది పేద, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వారికి పట్టాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ కోరారు. రిజిస్ట్రేషన్ పట్టాల సాధన కోసం నగరంలోని వెంకటేశ్వరపురం సెంటర్‌లో సోమవారం ప్రజలతో కలిసి సామూహిక నిర సన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మూలం రమేష్, నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ వెంకటేశ్వరపురం, జనార్దనరెడ్డి కాలనీ, గాంధీ గిరిజనకాలనీ, ఇస్లామ్‌పేట, భగత్‌సింగ్ కాలనీ ప్రాంతాల్లో వేలాది కుటుంబాలతో పాటు బాలాజీనగర్, కోటమిట్టలో ఉంటున్న పేదల ఇళ్లకు రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం 53వ డివిజన్ సచివాలయ అడ్మిన్, సెక్రటరీలకు వినతిపత్రం అందజేశారు. సీపీఎం నాయకులు సూర్యనారాయణ, మస్తాన్‌బీ, గడ్డం శ్రీనివాసులురెడ్డి, మూలం ప్రసాద్, నరసింహ, పద్మ, జాఫర్, శ్రీనివాసులు, కరిముల్లా, రవి, మణి, షకీలా, వెంకటేశ్వర్లు, , ధనమ్మ, లక్ష్మి, భార్గవి పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లు జరిగేలా చూడండి

నెల్లూరు(దర్గామిట్ట) : పొట్టేపాళెం గ్రామ పొలాలకు ప్రస్తుతం రిజిస్ట్రేషన్లు నిలిపివేసి ఉన్నారని, వెంటనే సమస్యను పరిశీలించి న్యాయం చేయాలని నెల్లూరు రూరల్ మండలం పొట్టేపాళెం గ్రామానికి చెందిన శ్రీకాంత్‌రెడ్డి సోమవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ గ్రామానికి సంబంధించి వ్యవసాయ భూమికి రిజిస్ట్రేషన్లు చేయకుండా ఆపి ఉన్నారన్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తనకు న్యాయం చేయాలని కోరారు.

పరమేశ్వరా.. పాహిమాం

- భక్తిశ్రద్ధలతో కార్తీక సోమవారం
- కిటకిటలాడిన ఆది దంపతుల నెలవులు




ప్రత్యేకాలంకరణలో శివలింగం




నెల్లూరు(బృందావనం) : కార్తీక మాసం తొలి సోమవారం సందర్భంగా పార్వతీ పరమేశ్వరుల కొలువులు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచే భక్తుల రాకతో 'ఓం నమః శివాయ' నామస్మరణతో ఆదిదంపతుల కొలువులు పులకించాయి. నగరంలోని వివిధ ఆలయాల్లో వివిధ రూపాల్లో కొలువైన స్వామివార్లకు అర్చకులు, వేద పండితులు శాస్త్రోక్తంగా మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, క్షీరాభిషేకాలు, విశేషపూజలు, ఉత్సవాలు, అర్చనలను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు ప్రసాదించాలంటూ ఉపవాస దీక్షలతో కార్తీక దీపాలు వెలిగించి, నోములు నోచుకుని శివపార్వతులకు ప్రణమిల్లారు. సర్వాలంకార శోభితంగా కొలువైన ఉమామహేశ్వరులను భక్తులు విశేషంగా దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించి పులకించిపోయారు.

- మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం స్వామివార్లకు విశేష పుష్పాలంకరణ, ప్రాకారోత్సవం నిర్వహించారు. మూలాపేటలోని అన్నపూర్ణ సమేత నీలకంఠేశ్వరుని ఆలయం, నవాబుపేటలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయం, సీఏఎం ఉన్నత పాఠశాల దగ్గర ఉన్న ఉమామహేశ్వరాలయం, మూలాపేట శంకరమఠంలోని కామాక్షి సమేత చంద్రమౌళీశ్వర స్వామి ఆలయం, క్రాంతినగర్ కొండా బలరామిరెడ్డి వీధిలోని శివకేశవుల ఆలయం, పప్పులవీధి శివాజీ నగర్‌లో పార్వతీదేవి సమేత పంచభూతేశ్వర స్వామి ఆలయం, సంతపేట ములుముడి బస్టాండ్ సమీపంలో ఉన్న భ్రమరాంబ సమేత శ్రీహరిహరనాథ ఆలయంతో పాటు నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న నీలకంఠేశ్వరుడి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు.





చెట్టు కింద కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు



మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో..